క్లుప్తంగా

హెల్మెట్ తలకు భారం కాదు

శిరివెళ్ల: హెల్మెట్ తలకు భారం కాదని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్ అన్నారు. బుధవారం యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోడ్డు ప్రమాదాలు– హెల్మెట్ ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత అధిక వేగంతో బైక్‌లను నడపడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. అయితే హెల్మెట్ ధరించినప్పుడు ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడుతుందన్నారు. మీతి మిరిన వేగం ప్రాణ సంకటమని, మద్యం సేవించి వాహనాలను నడపడం శ్రేయస్కరం కాదన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సాధారణం



దస్తగిరి దంపతులను సన్మానిస్తున్న పోస్టల్ సిబ్బంది

చాగలమర్రి: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సాధారణమని ఆళ్లగడ్డ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రాంనాథ్ అన్నారు. బుధవారం మండలంలోని మద్దూరు గ్రామంలో అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన దస్తగిరికి స్థానిక తపాలా కార్యాలయంలో సన్మానసభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రాంనాథ్, పోస్టల్ సిబ్బందితో కలిసి దస్తగిరి దంపతులను సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు.

దోమల నివారణ కిట్ల పంపిణీ



చిన్నవంగలిలో ఎస్సీ హాస్టల్‌లో మందు పిచికారీ చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

చాగలమర్రి: సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మండలంలోని చిన్నవంగలి గ్రామంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో దోమల నివారణకు ఆల్ఫా సైపర్‌మైత్రిన్ కీటక నాశిని మందును పిచికారీ చేసినట్లు జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి జి.వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మండలంలోని ముత్యాలపాడు పీహెచ్‌సీ పరిధిలోని చిన్నవంగలి గ్రామంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను సందర్శించారు.

చిరుత నుంచి రక్షించాలి



డీఎఫ్‌ఓ అనురాగ్‌మీనాకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): నంద్యాల జిల్లా పరిధిలోని నల్లమల ప్రాంతంలోని మహానంది పరిసర ప్రాంతాల్లో కొన్ని రోజులుగా సంచరిస్తున్న చిరుతను బంధించి ప్రజలకు రక్షించాలని హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్ ఫయాజ్ కోరారు. బుధవారం ఈమేరకు డీఎఫ్‌ఓను స్థానిక కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేసి ఫయాజ్ మాట్లాడుతూ.. మహానంది దేవస్థానంలో చిరుత సంచరిస్తున్నా అక్కడి అటవీ అధికారులు స్పందించకపోవడంతో భక్తులతో పాటు స్థానికుల్లో భయాందోళన నెలకొందన్నారు. వెంటనే చిరుతను బంధించి తరలించాలని విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి చేసి చూపుతాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఉయ్యాలవాడ : నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపుతామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం రాత్రి మండల కేంద్రానికి రాగా.. టీడీపీ మండల కన్వీనర్ బోరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బోరెడ్డి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రజల ఆశలను వమ్ము చేయకుండా మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని చెప్పారు. మండల కేంద్రంలో సచివాలయ భవనం నిర్మించడం, మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని స్థానికులు వారి దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే పూర్తి చేయిస్తామని చెప్పారు. సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఆకుల చిన్నవెంకటసుబ్బయ్య, బలిజ సంఘం మండలాధ్యక్షుడు ఆకుల నడిపి వెంకటసుబ్బయ్య, నాయకులు బోరెడ్డి ఓబులరెడ్డి, కూడాల నారాయణరెడ్డి, పేరెడ్డి మోహన్‌రెడ్డి, చిట్టిపు రాజగోపాల్‌రెడ్డి, మారంరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, గోపిరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

డిష్ ఆపరేటర్‌పై దాడి

ఆళ్లగడ్డ: డిష్ ఆపరేటర్ మాళీశ్వరరెడ్డిపై దాడి జరిగింది. టీడీపీ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి డిష్‌లో మాళీశ్వరరెడ్డి ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం సద్దాం కాలనీలో తెగిన డిష్ తీగలను మరమ్మతు చేస్తుండగా మరో డిష్ నిర్వాహకులు వచ్చి అడ్డుకొని దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నట్లు పట్టణ సీఐ రమేష్‌బాబు తెలిపారు.

వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోండి

- రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించండి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, నిరంతరం అప్రమత్తంగా ఉంటూ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి వైద్య,ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో వైద్య ఆరోగ్యశాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ అధికారులను సమన్వయం చేసుకుంటూ కలుషిత నీటి సరఫరా, పారిశుద్ధ్య లోపం లేకుండా సీజనల్ వ్యాధులను అరికట్టాలన్నారు. రోగులకు డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో డ్యూటీ ప్రకారం డాక్టర్లు కచ్చితంగా అందుబాటులో ఉండి, సమయపాలన పాటించి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మూడు నియోజకవర్గాలలో గిరిజన ప్రాంతాలు ఉన్నాయని, ఆ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ వైద్య సహాయం అందేలా చూడాలని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు జరగాలన్నారు. దీబగుంట్ల, జూపాడుబంగ్లా మండలాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు డెలివరీలకు అనుకూలమైన సౌకర్యాలు లేనందున ప్రసవాలు జరగడంలేదని మిగిలిన 50 పీహెచ్‌సీలలో జరుగుతున్నాయన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించి అవసరమైన మందులు సరఫరా చేయాలని చెప్పారు. జిల్లాలోని ఏరియా ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ ఆసుపత్రులకు హాస్పటల్ డెవలప్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. అలాగే..వ్యాక్సినేషన్ ప్రోగ్రాం కూడా పక్కాగా జరగాలన్నారు. షెడ్యూల్ ప్రకారం 104, 108 వాహనాలు పర్యటించి ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు నిత్యం 1200 నుంచి 1400 మంది ఓపీ ఉంటున్న నేపథ్యంలో అందుకు అవసరమైన చికిత్సలు నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రేడియాలజిస్టు, సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు, ప్లేట్లేట్ అజిటేటర్ మిషన్ కొరత ఉన్నందువలన డెంగీ వ్యాధిగ్రస్తులకు సకాలంలో వైద్య సేవలు అందించలేకపోతున్నామని జీజీహెచ్ సూపరింటెండెంట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. సంబంధిత ప్రతిపాదనలను తనకు సమర్పించాలని చెప్పారు. వచ్చే వారం నుంచి తాను అన్ని వైద్యశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని ఎలాంటి లోపాలు వెల్లడైనా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లాలోని టీబీ వ్యాధిగ్రస్తులకు సరైన న్యూట్రిషన్ సపోర్ట్ ఇవ్వడంతో పాటు వ్యాధిగ్రస్తులను గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. జిల్లాలో 101 ఆరోగ్యశ్రీ హాస్పిటల్లో 67 మంది ఆరోగ్య మిత్రలు ఉన్నారని అదనపు ఆరోగ్య మిత్రల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, ఆసుపత్రి సూపరింటెండెంట్ వరప్రసాదరావు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

ఉపాధి హామీ లక్ష్యాలను అధిగమించండి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో ఉపాధి హామీ, గ్రామ, వార్డు సచివాలయాల పనితీరుపై సమీక్షించారు. జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, డీఎల్‌డీఓ కల్యాణి తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసి చేపట్టిన 95 పనుల్లో వేతన సంబంధ, మెటీరియల్ కాంపోనెంట్ కింద చేపట్టిన పనుల వివరాలను ఇవ్వాలని సూచించారు. దినసరి కూలి రూ.300 కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుండగా సగటున చెల్లిస్తున్న రోజు కూలి రూ.239 మాత్రమే ఉందని, నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేయించి కూలి మొత్తాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ మాసానికి 45 లక్షల పని దినాలకు గాను ఇప్పటి వరకు ఇప్పటివరకు 44.82 లక్షల పని దినాలు కల్పించారని, మిగిలిన లక్ష్యాన్ని వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లాలో చేపడుతున్న ఫారంపాండ్స్, ఫీడర్ చానల్ పనులు, ఫీల్డ్ చానల్ హార్టికల్చర్, ట్రెంచ్ వర్క్స్, బండి ప్లాంటేషన్ తదితర పనులకు సంబంధించిన అంశాలపై అడిగి తెలుసుకుంటూ సంబంధిత ఫైళ్లను సర్క్యులేట్ చేసి పరిపాలన ఉత్తర్వులు పొందాలన్నారు. పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. గత సంవత్సరానికి సంబంధించి నాలుగు మండలాలు మినహా మిగిలిన అన్ని మండలాలలో సోషల్ ఆడిట్ జరగాల్సి ఉందని డ్వామా పీడీ కలెక్టర్‌కు నివేదించారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ అటెండెన్స్ కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలి

నంద్యాల(న్యూటౌన్): పెంచిన విద్యుత్ చార్జీలను నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సీపీఎం నంద్యాల జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, పట్టణ కార్యదర్శి పుల్లానరసింహులు కోరారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగుదేశం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, పెంచబోమని చెప్పి మళ్లీ పెంచడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల చట్టం తేవడం, వాటిని అమలు చేసేందుకు చంద్రబాబునాయుడు పూనుకుంటున్నారని, వీటిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు.

వేతనాలు పెంచాలి

చాగలమర్రి: ప్రభుత్వాలు ఐసీడీఎస్‌ను బలోపేతం చేసి అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలను పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకటన్న ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ రమణమ్మకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అఖిలభారత కోర్కెల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కొన్ని ప్రాంతాల్లో టీడీపీ నాయకులు అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయ కార్యకర్తలను తమ ఉద్యోగాలకు రాజీనామాలు చేయాలని బెదిరిస్తూ సెంటర్లకు తాళాలు వేస్తున్నారన్నారు. వారి వేధింపులను అరికట్టాలన్నారు. రజిని, నాగమణి, వై.పద్మావతి, బాల కుళ్ళాయమ్మ, అనురాధ, టి.శోభారాణి, సంజీవమ్మ పాల్గొన్నారు.

పశుసంపద అభివృద్ధికి చర్యలు

ఉయ్యాలవాడ : ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో మేలు జాతి పశు సంపదను అభివృద్ధి చేసేందుకు పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు రాజశేఖర్, రమణయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అల్లూరు గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణ కోసం చికిత్స శిబిరం నిర్వహించారు. పాడి పెంపకందారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎదకు వచ్చిన గేదెలు, ఆవులకు కృత్రిమ గర్భధారణ సూదులు వేయడం ద్వారా సంకరజాతి (మేలు రకం దూడలు) అభివృద్ధి చెందుతాయన్నారు. ఉమ్మడి జిల్లాలో మారుమూల గ్రామాల్లో సైతం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. 54 మండలాల్లో ప్రతి శిబిరంలో రూ. 20 వేల మేరకు ప్రభుత్వం ఎద సూదుల కోసం వ్యయం చేస్తుందన్నారు. ఎద సూదులు వేసేందుకు 525 కేంద్రాలు ఉన్నాయని వీటి ద్వారా ఈ ఏడాది 2.25 లక్షల పశువులకు సూదులు వేసి 90 వేల దూడలను పుట్టించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఇప్పటి వరకు రెండు జిల్లాల్లోని చిన్నటేకూరు, గోనెగండ్ల, ఎర్రగుడి, నన్నూరు. పేరూరు, దొర్నిపాడు, అల్లూరు గ్రామాల్లో ఎద సూదుల శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరంలో వైద్యాధికారులు ఏడీఏ వరప్రసాద్, పశు వైద్యులు రవీంద్రనాథ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శైలజ, నందిని పాల్గొని 45 గర్భకోశ చికిత్సలు, 60 లేగదూడలకు నట్టల నివారణ లివర్ టానిక్ మందులు తాపించారు. శిబిరంలో 40 మంది లేగదూడల పెంపకందారులకు బహుమతులు అందజేశారు. గ్రామ పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ రమణారెడ్డి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ ఆరికట్ల శివరామకృష్ణారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కూలూరు రామకృష్ణారెడ్డి, ఆరికట్ల శివారెడ్డి, దుత్తల చంద్రమోహన్‌రెడ్డి, న్యాయవాది మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.



ఆవుకు గర్భకోశ చికిత్సలు నిర్వహిస్తున్న పశు వైద్యాధికారులు

ఆ భూములు.. అంతేనా?

ఉయ్యాలవాడ : హరివరం గ్రామంలో దేవాలయాల భూములకు కౌలు వేలం నిర్వహించడంలో దేవదాయశాఖ అధికారులు అలసత్వం వహిస్తున్నారు. ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందే వేలం నిర్వహించే అధికారులు ఈ ఏడాది సీజన్ ప్రారంభమై 45 రోజులు దాటినా కౌలు వేలం ప్రక్రియ పూర్తి చేయలేదు. గ్రామంలో వెలిసిన శ్రీ వినాయక, జనార్ధన స్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయాలకు 90 ఎకరాల భూములున్నాయి.వీటిని ఏడాది పాటు సాగుకు కౌలుకు ఇచ్చేందుకు వేలాలు నిర్వహిస్తారు. అయితే ఈ ఏడాది వేలం వేయకపోవడం, ముందస్తు వర్షాలు కురవడంతో వాటిల్లో ప్రస్తుతం పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి బీడుగా దర్శనమిస్తున్నాయి. వీటిని కౌలుకు తీసుకుంటే గడ్డి, పిచ్చిమొక్కల తొలగింపునకు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుందని, విత్తనం వేసేందుకు కూడా అదును దాటిపోతుందని రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై ఈఓ చంద్రుడిని వివరణ కోరగా వారంలోపు వేలం నిర్వహిస్తామని చెప్పారు.



హరివరం మాన్యం భూముల్లో పెరిగిన పిచ్చి మొక్కలు

మాదక ద్రవ్యాలను అరికట్టాలి

నంద్యాల(న్యూటౌన్): యువతను నాశనం చేసే మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలను అరికట్టాలని ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాముడు కోరారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న మాదక ద్రవ్యాలను ఎన్‌డీఏ కూటమి అరికట్టాలన్నారు. అలాగే ముచ్చుమర్రి గ్రామంలో బాలికను అత్యాచారానికి గురి చేసిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. రవి, విష్ణు, మధు, పెద్దారెడ్డి, పాములేటి పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి..

బాలికపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు డిమాండ్ చేశారు. కాలయాపన చేయకుండా చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ముచ్చుమర్రి గ్రామానికి చెందిన చిన్నారిని అదే గ్రామానికి చెందిన నలుగురు బాలురు మత్తు పదార్థాల ప్రభావం వల్ల అత్యాచారం చేయడం దుర్మార్గమన్నారు. ప్రతాప్, ధనుంజయ్ పాల్గొన్నారు. అలాగే.. చిన్నారిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో పోలీసులను కోరారు.

ఉపాధి పనులపై విచారణ

గోస్పాడు: మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై 18వ విడత సామాజిక తనిఖీలో వచ్చిన అభియోగాల విచారణలో భాగంగా అంబుడ్స్ పర్సన్ సురేంద్ర కుమార్ విచారణ చేపట్టారు. బుధవారం మండలంలోని కానాలపల్లె, సాంబవరం, తేళ్లపురి గ్రామాల్లో విచారణ చేపట్టారు. సామాజిక తనిఖీలో తేళ్లపురిలో రూ.45వేలు, సాంబవరంలో రూ.1.51లక్షలు, కానాలపల్లెలో రూ.1.01లక్షలు దారితప్పడంపై ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. దీంతో మండలస్థాయి సామాజిక తనిఖీ సమావేశంలో రికార్డులు పరిశీలించిన జిల్లా ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారని ఆయన తెలిపారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో వేతనదారులు పనికి వెళ్లిన వివరాలు, పని చేసిన రోజులు, జాబ్ కార్డు, బ్యాంకు అకౌంటు తదితరాల వివరాలకు సంబంధించిన ధ్రువ పత్రాలను పరిశీలించి నివేదికను తయారు చేశామన్నారు. ఎంపీడీఓ నాగఅనసూయ, ఏపీఓ నాగజ్యోతి పాల్గొన్నారు.



తేళ్లపురిలో విచారణ చేస్తున్న అధికారులు

సాదాసీదాగా మండల సభ

నంద్యాల(అర్బన్): స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంబంధిత శాఖలకు సంబంధించిన ప్రగతిని అధికారులు చదివి వినిపించారు. ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల్లో ఒకరిద్దరు మినహా సమస్యలపై చర్చించ లేదు. సచివాలయాలు, ఆర్బీకేలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి నెలలు గడుస్తున్నా బిల్లులు మంజూరు కాలేదన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులు సర్పంచులకు తెలియకుండా చేస్తున్నారని, కేవలం తీర్మానాల కోసం మాత్రమే పంచాయతీ కార్యాలయానికి ఫీల్డ్ అసిస్టెంట్లు వస్తున్నారు మినహా సమాచారం తమకు అందడం లేదని అయ్యలూరు, గుంతనాల, బ్రాహ్మణపల్లె గ్రామాల సర్పంచులు సభ దృష్టికి తెచ్చారు. ఎంపీడీఓ సౌభాగ్యం, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఓ ప్రసాదరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

రాజకీయ వేధింపులు సరికాదు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

రుద్రవరం: అంగన్‌వాడీ, ఆశా, ఉపాధి హామీ, పారిశుద్ధ్య, మధ్యాహ్న భోజనం, మెప్మా, సమగ్రశిక్ష, ఆయుష్, గ్రామ పంచాయతీ, స్వచ్ఛ భారత్, సేంద్రియ వ్యవసాయం, 108, 104 తదితర శాఖల్లో పనిచేస్తున్న కార్మికులపై రాజకీయం వేధింపులు సరికాదని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టీ.రామచంద్రుడు అన్నారు. బుధవారం ఆయా శాఖల కార్మికలతో స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దారు మురళీమోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్మిక హక్కులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కార్డులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు ముగిశాక రాష్ట్రంలోని పలు జిల్లాల్లో స్కీం వర్కర్లపై సాగుతున్న రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. మనోజ, పద్మ, కృపావతి ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): పాఠశాలల్లో బోధన ప్రశాంతంగా జరిగేలా చూడాలని, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. బుధవారం ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు సాంబశివుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై విద్యార్థుల తల్లిదండ్రులు దాడులు చేయడం, విమర్శించడం, ఉపాధ్యాయులను మానసికంగా వేధించడం వల్ల విద్యార్థులకు సరైన బోధన అందించలేకపోతున్నామన్నారు. ప్రశాంత వాతావరణంలో బోధన సాగేందుకు రక్షణ కల్పించాలన్నారు. ఇటీవల కొలిమిగుండ్ల మండలం కోరుమానుపల్లె ఉపాధ్యాయుడిని రేషన్ డీలర్ దూషించారని, నిందితుడిపై చర్యలు తీసుకోవాలన్నారు. మునిస్వామి, పుల్లయ్య, ప్రతాపరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'పీఎంఎంవీవై'పై అవగాహన

దొర్నిపాడు: ప్రధానమంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) పథకంపై గర్భిణులు, బాలింతలు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ తెలిపారు. విషన్ సంకల్ప్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. ఈ పథకం ద్వారా రూ.6వేలు వస్తుందన్నారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా ప్రతినెలా వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త వెంకటసుబ్బమ్మ ఉన్నారు.



బాలింతలకు అవగాహన కల్పిస్తున్న ప్రభాకరమ్మ

ట్యాంకులను శుభ్రం చేయండి

దొర్నిపాడు: ప్రతి రెండు వారాలకు ఒకసారి మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. బుధవారం మండలంలోని క్రిష్టిపాడు, బుర్రారెడ్డిపల్లె గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. అలాగే క్రిష్టిపాడులో ట్యాంకులకు సరఫరా అవుతున్న కుందూ నీటిని పరిశీలించారు. నీటిని క్లోరినేషన్ చేసిన తరువాతే సరఫరా చేయాలని ఆదేశించారు. ట్యాంకుల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. సర్పంచ్ శివరామిరెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉజ్మ ఉన్నారు.

రికార్డుల నిర్వహణ తప్పనిసరి

రుద్రవరం: గ్రామ సచివాలయాల్లో రికార్డుల నిర్వాహణ తప్పనిసరి అని ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మ అన్నారు. మండలంలోని శ్రీరంగాపురం, ఎల్లావత్తుల గ్రామా సచివాలయాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులు, ఇంటి, నీటి పన్ను వసూలు రికార్డులు, సిబ్బంది హాజరు తదితర రికార్డులను పరిశీలించారు. ప్రతి ఉద్యోగి సకాలంలో విధులకు హాజరు కావాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శులు పాములేటి,కొండయ్య ఉన్నారు.

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ

నంద్యాల(అర్బన్): మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంఈఓ బ్రహ్మం నాయక్ తెలిపారు. పట్టణానికి చెందిన భాష్యం పాఠశాల విద్యార్థులు బుధవారం ఎంఈఓ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ముందుగా ఎంఈఓకు మొక్కను అందించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. పాఠశాల జెడ్ ఈఓ అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలు పదిలం

నంద్యాల(అర్బన్): ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరిస్తే ప్రమాదాల సమయంలో ప్రాణాలను కాపాడతుందని మదర్ సొసైటీ ఫౌండర్ రామారావు పేర్కొన్నారు. బుధవారం పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు హెల్మెట్ ఉపయోగంపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరెడ్డి, తిరుపతిరావు, రత్నకుమారి, రవికుమార్, నాగేశ్వరరావు, బద్రేశ్వరరావు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పరిశీలన

శిరివెళ్ల: యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం సర్వశిక్ష అభియాన్ రాష్ట్ర పరిశీలకుడు పెంచలయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పంపిణీ చేసిన స్టూడెంట్ కిట్లను పరిశీలించారు. వాటి నాణ్యతను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. టీచర్లు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించి పలు సూచనలు చేశారు. తరగతి గదులకు వెళ్లి ఐఎఫ్ ప్యానల్ ఉపయోగాలపై విద్యార్థులను ఆరా తీశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు రుచికరమైన భోజనం వడ్డించాలని ఏజెన్సీలను ఆదేశించారు. ఏఎంఓ లలితకుమారి, ఎంఈఓలు శంకరప్రసాదు, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

ఆళ్లగడ్డ: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ పెంచలయ్య సూచించారు. బుధవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో స్టూడెంట్స్ కిట్స్‌ను పరిశీలించారు. విద్యార్థుల అడ్మిషన్లు, వారి సంఖ్యను ఆరా తీశారు. అనంతరం ఆయన బాలికలకు యూనిఫాం అందజేశారు. పదవ తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరుప్రఖ్యాతలు తీసుక రావాలన్నారు. అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ లలిత, అసిస్టెంట్ ఏఎంఓ యూనస్‌బాషా, ఎంఈఓ శోభావివేకావతి, హెచ్‌ఎం సంధ్యారాణి ఉన్నారు.



యర్రగుంట్లలో స్టూడెంట్ కిట్‌లోని యూనిఫాం, బ్యాగులను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు

వెదురుకర్రే ధ్వజ స్తంభం

- మాన్యం కౌలు రూపంలో ఏటా రూ.లక్షల ఆదాయం
- పట్టించుకోని ఆలయ నిర్వాహకులు

రుద్రవరం: స్థానిక పడమటి వీధిలోని ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ధ్వజ స్తంభంగా వెదురు కర్రను ఉంచారు. నిత్యం పూజలు చేసేందుకు వచ్చే భక్తులు ఇదేమని ముక్కున వేలేసుకుంటున్నారు. గ్రామంలోని భాస్కర,నందీశ్వర,దొర్వి నరసింహ స్వామి,ఆంజనేయస్వామి ఆలయాలు సమూహ దేవాలయాలుగా ఉన్నాయి. వాటన్నింటికీ దాదాపు 36.79 ఎకరాల మాన్యం ఉంది. అందులో ఆంజనేయ స్వామి ఆలయానికి దాదాపు 25 ఎకరాల భూమి ఉంది. ఏటా మాన్యానికి కౌలు రూపంలో లక్షలాది రూపాయాల ఆదాయం లభిస్తోంది. అయినప్పటికీ ఆలయ అభివృద్ధిని నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. కొంత కాలంగా ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. దీంతో పలువురు భక్తులు ప్రశ్నిస్తుండటంతో నిర్వాహకుల్లో చలనం వచ్చింది.మెల్లగా వసతులు కల్పించసాగారు. ఇటీవల భారీగా వీచిన గాలికి ఆలయంలోని ధ్వజస్తంభం కూలింది. కూలిన ధ్వజ స్తంభాన్ని మూలకు చేర్చి, ఆ స్థానంలో వెదురు కర్రను నిలబెట్టారు. ధ్వజ స్తంభం కూలడం, అలాగే వదిలేయడం అరిష్టమని, వెంటనే కొత్త ధ్వజస్తంభం ప్రతిష్ఠించాలని భక్తులు కోరుతున్నారు. రెండు రోజుల క్రితమే మాన్యం భూములకు కౌలు వేలం నిర్వహించారు. వచ్చిన ఆదాయంతో కొత్త ధ్వజస్తంభం ప్రతిష్ఠించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.



రుద్రవరం ఆంజనేయ స్వామి ఆలయంలో ధ్వజ స్తంభంగా ఉన్న వెదురు కర్ర

గుండె వ్యాధులతో జాగ్రత్త

గోస్పాడు: గుండెవ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్. మన్‌జాన్‌షావలి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం శాంతిరాం ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులో ఉండాలని వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీర్ఘకాలిక వ్యాదులైన బీపీ, షుగర్ పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆహార అలవాట్లను మార్చుకోవాలని, మితాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. శిబిరంలో 115 మందిని పరీక్షించి బీపీ, షుగర్, ఈసీజీ, టుడీఎకో పరీక్షలు చేశారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులను అందజేశారు.

లింగ వివక్ష చూపొద్దు

ఆళ్లగడ్డ : ఆడ, మగ ఇద్దరూ సమానమేనని, ప్రతి ఒక్కరూ సమదృష్టిని అలవర్చుకుని లింగ వివక్షకు ముగింపు పలకాలని అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. సంకల్ప్ హ్యు వంద రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా పడకండ్ల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలపై లైంగిక వేధింపుల నియంత్రణ, జీవన నైపుణ్యాలను వివరించారు. కార్యకర్తలు తిరుపతమ్మ, సుజాత, నాగేంద్రమ్మ, సాలమ్మ, ఉమాదేవి ఉన్నారు.